ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 జూలై 2024


కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

కడప (క్రైమ్), జూలై18: కలెక్టర్ శివశంకర్ లోతేటిని నూతన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎస్పీ కలెక్టర్ చాంబర్‌లోకి వెళ్లి ఆయనకు పూలమొక్క అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్, జిల్లాలోని పలు సమస్యలపై ఇద్దరూ చర్చించుకున్నారు. హర్షవర్ధన్‌రాజు ఎస్పీగా బుధవారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

ఉద్యానానికి ఊతం

వ్యవసాయానికి మళ్లీ మంచిరోజులు వస్తున్నాయి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఇటు రైతులు, రైతు సంఘాలు, వివిధ పార్టీల నేతలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆ డిమాండ్ నెరవేరే దిశగా చంద్రబాబు పాలనలో అడుగులు పడుతున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వందశాతం రాయితీతో పండ్లతోటల సాగు చేపట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఇది సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. మొక్కలు ఇవ్వడం నాటడమే కాదు మూడేళ్లపాటు వీటి నిర్వహణకు ప్రభుత్వమే డబ్బు చెల్లిస్తుంది. ఇది సన్న, చిన్నకారు రైతులకు సువర్ణ అవకాశం. ప్రభుత్వ నిర్ణయం వల్ల జిల్లాలో ఉద్యానవన పంటల సాగు గణనీయంగా పెరగనుంది.





- ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్లతోటల సాగు
- సన్న, చిన్నకారు రైతులకు వరం
- జిల్లాలో ఐదువేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- రూ.55కోట్లు వ్యయం



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే చీనీ, నిమ్మ, అరటి, మామిడి, సపోట, డ్రాగన్‌ఫ్రూట్‌తో పాటు పూల జాతులు సాగులో ఉన్నాయి. హార్టికల్చర్ హబ్‌గా కడప జిల్లాను మారుస్తామంటూ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జిల్లాకు వచ్చిన ప్రతిసారి హామీ ఇస్తూ వచ్చారు. ప్రస్తుతం ఉద్యానవన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఇవి సాగుచేసుకోవాలంటే రైతుకు ఆర్థికంగా భారం. ఇప్పుడు సన్న, చిన్నకారు రైతులు పైసా భారం లేకుండానే ఉద్యాన పంటలు సాగుచేసుకోవచ్చు. ఈ ఆర్థికసంవత్సరంలో జిల్లాలో ఐదువేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యాన పంటలు సాగుచేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.55కోట్లు ఖర్చుచేయనున్నారు. ఈ మేరకు డ్వామా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

సన్న, చిన్నకారు రైతులకు వరం

ఉపాధి హామీ పథకం ద్వారా హార్టికల్చర్ పంటలను సాగుచేసుకునే అవకాశం రావడంతో సన్న, చిన్నకారు రైతులకు వరంగా మారింది. ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులు దీనికి అర్హులు. చీనీ, నిమ్మ, మామిడి, డ్రాగన్ ఫ్రూట్, సపోట, బొప్పాయి, దానిమ్మ, సీతాఫలం, మునగ, రోజాపూలు, జాస్మిన్ తదితర పంటలు సాగు చేసుకోవచ్చు. జాస్మిన్, రోజా పూలు రెండు సంవత్సరాలు సాగుచేసుకోవచ్చు. కుటుంబానికి ఐదు ఎకరాలకు మించి భూమి ఉండకూడదు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తుండాలి. ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులు. ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు ఉండాలి. అర్హులైన రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకం, తహసీల్దార్ జారీ చేసిన రైతు సర్టిఫికేట్, 1బీ, బ్యాంకు పాసుపుస్తకం నకళ్లతో గ్రామంలో ఉండే ఫీల్డ్ అసిస్టెంట్ లేదా టెక్నకల్ అసిస్టెంట్ లేదా ఏపీఓ, ఎంపీడీఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇంతవరకు 2200 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి. మొక్కను తీసుకురావడం, గుంతలు తవ్వడం, పూడ్చడం అంతా ప్రభుత్వం భరిస్తుంది.

రైతుల్లో ఆనందం

ఉద్యానపంటలపై మక్కువ చూపే సన్న, చిన్నకారు రైతుల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆనందం వెల్లివిరుస్తోంది. పంట సాగుకు ఎరువులకు అయ్యే ఖర్చుతో పాటు కూలీల ఖర్చు కూడా రైతులకు తలకు మించిన భారంగా తయారయ్యేది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు టిఫెన్‌తో పాటు ఒక్కొక్కరికి రూ.600 దాకా కూలీ ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని ప్రాంతాలలో కూలీలు కూడా దొరకరు. అలాంటి సమయంలో ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకుని పొలాల్లో పనులు చేయించుకునేవారు. ఉపాధి పనులు మొదలుకాగానే ఆ అవకాశం కూడా రైతులకు ఉండదు. ఆ సమయంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ఈ నేపథ్యంలో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడంతో సన్న, చిన్నకారు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలి

- ప్రజా పిర్యాదులు తక్షణమే పరిష్కరించేలా చర్యలు
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

కడప (క్రైం), జూలై 18: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎలాంటి పక్షపాతం చూపకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య ఉంటూ ప్రభావవంతంగా విధులు నిర్వహించే విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలకు వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఎక్కడైనా ఏదైనా సమస్యలు జరుగుతాయని తెలిస్తే వాటిని కట్టడి చేసేలా ముందుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి విక్రయాలపై నిఘా ముమ్మరం చేయాలని సూచించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇందులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో ప్రజలకు జవాబుదారీగా ఉంటూ చట్టపరిధిలో విధులు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో ఉన్న వాహనాలను పరిశీలించి వాటిని విడుదల చేసే అవకాశం ఉంటే యజమానులకు అప్పగించాలని సూచించారు. ఆకతాయిలపై కఠినంగా వ్యవహరించాలని, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్, సెబ్ ఏఎస్పీ వెంకటరాముడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాఘవరెడ్డిని విచారిస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్


పూర్వ ఆర్జేడీపై విచారణ

- ఆధారాలు సమర్పించిన యూటీఎఫ్, విద్యార్థి సంఘాలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 18: పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం విచారణ జరిగింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీ ఏపీ డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. రాఘవరెడ్డి కడప డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వివాదాస్పద అధికారిగా పేరుగాంచారు. అప్పటి అధికార పార్టీ వైసీపీ అండ తనకు ఉందంటూ ఉపాధ్యాయుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, వేధించడం, ప్రశ్నించిన వారిని అక్రమంగా సస్పెండ్ చేయడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం పరిపాటిగా మారింది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు రాఘవరెడ్డి వైఖరిపై గళమెత్తారు. దీనిపై స్పందించిన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అప్పటి కలెక్టర్‌కు, రాష్ట్ర గవర్నర్‌కు సైతం రాఘవరెడ్డి అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అయితే రాఘవరెడ్డి అవినీతిపై అప్పటి వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా ఆయనకు ఆర్జేడీగా పదోన్నతి కల్పించింది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో రాఘవరెడ్డిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రసన్నకుమార్ విచారణ చేపట్టారు.

ఆధారాలు సమర్పించిన యూటీఎఫ్

పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతిపై యూటీఎఫ్ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం యూటీఎఫ్ ప్రతినిధులు విచారణకు హాజరై విచారణ అధికారికి ఆధారాలను సమర్పించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాళెం మహేశ్‌బాబు మాట్లాడుతూ రాఘవరెడ్డి డీఈవోగా జిల్లాకు వచ్చిన నాటి నుంచి అవినీతి అక్రమాలే పరమావధిగా కొనసాగారన్నారు. ఉపాధ్యాయులను దూషించడం, ప్రశ్నించిన వారిని సస్పెండ్ చేయడం షోకాజ్ నోటీసులు జారీచేయడం ఆయన నైజం అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఆందోళన చేపట్టడానికి వీలు లేదంటూ వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత ఏడాది జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తనకు అర్హత లేకపోయినా యూజీసీ స్కేల్‌ను అక్రమంగా పొందాడన్నారు. అక్రమంగా పొందిన అదనపు వేతనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా పెడచెవిన పెట్టారని విమర్శించారు. డీఈవోగా ఆయనపై పలు ఆరోపణలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం ఆయనకు ఇక్కడే ఆర్జేడీగా పదోన్నతి కల్పించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేయడం మంచి పరిణామం అన్నారు. ఆయన చేసిన అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే.. రాఘవరెడ్డిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జల వలరాజు డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయంలో రాఘవరెడ్డిపై విచారణాధికారి డాక్టర్ ఎంఆర్ ప్రసాద్‌కు ఆధారాలు సమర్పించారు.

కాగా.. రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి విచారణ చేసి రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని విచారణాధికారి తెలిపారు. ప్రధానంగా పదోన్నతులు, రివర్షన్లకు సంబంధించి రాఘవరెడ్డిపై ఆరోపణలు వచ్చాయన్నారు. ఫిర్యాదుదారులు ఇచ్చిన ఆధారాలతో పాటు డీఈవో, ఆర్జేడీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలిస్తామన్నారు.

ఉపాధ్యాయునిపై రాఘవరెడ్డి అనుచరుల దాడి

పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డికి సంబంధించి విచారణకు హాజరైన బయలాజికల్ సైన్సు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుపై రాఘవరెడ్డి అనుచరులు దాడి చేశారు. ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్ నేలకేసి కొట్టారు. ఉపాధ్యాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాఘవరెడ్డిపై ఫిర్యాదు చేస్తావా అని దుర్భాషలాడారు. దీంతో ఉపాధ్యాయుడు చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


విచారణాధికారికి ఆధారాలు సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు

- జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సమావేశంలో కలెక్టర్


కడప(కలెక్టరేట్), జూలై 18: దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను, కమిటీ సభ్యులను ఆదేశించారు. భవిష్యత్తులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా ఉండే దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గత సమావేశంలో చర్చించిన విషయాలలో చాలా అంశాలు పరిష్కరించామని, పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టంపైన ప్రజల్లో అవగాహన పెంచేలా సదస్సులు నిర్వహించేందుకు మండల, డివిజనల్ స్థాయిలో రెవెన్యూ, డీఎస్పీలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, డీఎస్పీలు, సోషల్ వెల్ఫేర్ డీడీ, ఎస్సీఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ఈడీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీషన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీషన్ గార్డెన్స్ ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజన పథకంలో తాజాగా పండించిన కూరగాయాలను వినియోగించాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో స్కూల్ న్యూట్రీషన్ గార్డెన్స్‌పై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో న్యూట్రీషన్ గార్డెన్స్ ఏర్పాటుకు స్థలం గుర్తించి నివేదికలు వెంటనే పంపాలన్నారు. సంబంధిత అధికారులకు వర్క్ షాపు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. తాజాగా పండించిన కూరగాయల వినియోగం ద్వారా పోషక ఆహార లోపం, సూక్ష్మ పోషకాల లోపాలను అధిగమించ వచ్చన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. వాటి నిర్వహణ కూడా స్కూలు కమిటీ, పేరెంట్స్ కమిటీలలో తెలియజేసి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో అనురాధ, డీఆర్డీయే పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జ్ వీసీగా కృష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 18: యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా వైవీయూ ఫిజిక్స్ విభాగంలో సీనియర్ ఆచార్యులు డాక్టర్ కృష్ణారెడ్డిని ఉన్నత విద్యామండలి గురువారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన విశ్వవిద్యాలయంలో పలువిభాగాల్లో పనిచేశారు. దీంతో ఉన్నత విద్యామండలి ఈయనకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించింది. ఈయన శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా.. ఇన్‌చార్జ్ వీసీగా నియమితులైన కృష్ణారెడ్డిని వైవీయూ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి శాలువతో ఘనంగా సత్కరించారు.


కృష్ణారెడ్డి


విశ్వనాథకుమార్

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి..

డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ఆంధ్ర యూనివర్శిటీ ఆర్కిటెక్చర్ విభాగం ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్‌ను ఉన్నత విద్యామండలి నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

సైబర్ చోరీలు ఆగేనా?



- ఈకేవైసీ, ఆధార్ హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు
- నకిలీ వేలిముద్రలతో డబ్బులు దోచుకుంటున్న వైనం
- రూ.10వేల చొప్పున డ్రా
- 19 నెలల్లో జిల్లాలో 382 ఫిర్యాదులు



కడప (క్రైం), జూలై 18: సైబర్ నేరగాళ్లు రోజుకో పద్ధతి ద్వారా డబ్బులు కాజేస్తున్నారు. మార్కెట్లో ప్రజలు ఏ ఆన్‌లైన్ సిస్టంకు అలవాటుపడతారో ఆ మార్గంలోనే నేరాలకు పాల్పడుతున్నారు. బ్యాంకులకు వెళ్లి డబ్బు డ్రా చేసుకోలేని వారు ఫోన్‌పే, గూగుల్‌పే కాకుండా కొంత మంది కస్టమర్‌సర్వీస్ పాయింట్లను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి వారిని టార్గెట్ చేసుకుని వారి ఖాతాల్లోని మొత్తాలను ఖాళీ చేస్తున్నారు. తమ ప్రమేయం లేకుండానే ఖాతాల్లో డబ్బు ఖాళీ అవుతుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

నేరాలకు ఇలా పాల్పడతారు

ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ సిస్టం) వినియోగిస్తున్న కస్టమర్ల పూర్తి వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారు. వారు వేసే వేలిముద్రలను ఈ సిస్టమ్ ద్వారా ప్లాస్టిక్ ఫైబర్‌తో తయారు చేసుకుంటున్నారు. వేలిముద్ర తొడుగులను వేలికి వేసుకుని ఈ ఫింగరును వినియోగించి ఒరిజినల్ ఖాతాదారుడి అకౌంటు నుంచి రూ.10వేలలోపు డబ్బు డ్రా చేస్తున్నారు. ఖాతాదారులు దీనిని గుర్తించకపోతే మాత్రం వీరి ఖాతాలో సొమ్మును దఫాల వారీగా ఖాళీ చేసేస్తారు. ఎక్కువగా మధ్యప్రదేశ్, ముంబై, కలకత్తాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఏఈపీఎస్ ద్వారా 19 నెలల్లో 382 మంది నుంచి రూ.10వేల చొప్పున వీరు డబ్బు కొట్టేశారు.

బ్యాంకుల ద్వారా డబ్బు డ్రా చేసుకోవాలి

ఎవరైనా డబ్బు అవసరమైతే నేరుగా బ్యాంకులకు వెళ్లి అక్కడ విత్‌డ్రా చేసుకోవడమే మంచిది. ఏఈపీఎస్ ద్వారా కస్టమర్ సర్వీసు పాయింట్ వద్దకు వెళ్లి వేలిముద్ర కారణంగా డబ్బులు డ్రా చేసుకుంటే అవి సైబర్ నేరగాళ్లకు ఈజీగా మారుతోంది. దీంతో మీ ఖాతాలో డబ్బులు కొట్టేసే అవకాశం ఉంటుంది. బ్యాంకుల ద్వారా అయితే డబ్బు సేఫ్టీగా ఉంటుంది.

ఏఈపీఎస్ అంటే ఏమిటి?

నేరుగా బ్యాంకులకు వెళ్లలేని వారికోసం బ్యాంకులు కస్టమర్ సర్వీసు పాయింట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చాయి. దీనినే ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) అంటున్నారు. ఈ వ్యవస్థలో వినియోగదారులు వారి ఆధార్ నెంబరు లేదా వర్చువల్ ఐడీని ఉపయోగించి మైక్రో ఏటీయంలలో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తారు. బ్యాంకు అకౌంటుకు లింకు అయిన ఆధార్ కార్డు నెంబరు ఎంటర్ చేసి మొబైల్ నెంబరు ఎంటర్ చేసి కేవైసీలో ఫింగర్ నమోదు చేస్తే పదివేలు క్యాష్ నిమిషాల్లో కస్టమరుకు అందిస్తారు. బ్యాంకులకు వెళ్లి క్యూలో గంటల తరబడి ఉండలేక కొంతమంది ఏఈపీఎస్ ద్వారా డబ్బు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల వివరాలను హ్యాక్ చేస్తున్నారు.

ఉలిక్కిపడ్డ ఆర్టీపీపీ

- రూ.7లక్షల సైబర్ చోరీతో..
- ఖాతాల్లో అధిక మొత్తాలున్నవారి గుండెల్లో రైళ్లు

ఎర్రగుంట్ల, జూలై 18: ఆర్టీపీపీ ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.7లక్షలు చోరీ చేయడంతో మిగిలిన ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. ఇలా ఎలా జరిగిందంటూ బాధితునికి భారీగా ఫోన్ కాల్స్ వచ్చాయి. 'ఆర్టీపీపీ ఉద్యోగి ఖాతాలో రూ.7లక్షలు మాయం' అనే వార్త ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఆదివారం రాత్రి పడుకుని సోమవారం నిద్ర లేచే సమయానికి అతని ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.7లక్షలు స్వాహా చేసేశారు. ఈ వార్తను చూసిన కాలనీ వాసులు.. ఇంత డబ్బును అంత సులువుగా ఎలా కొట్టేశారని చర్చించుకుంటున్నారు. బాధితునికి భారీగా ఫోన్లు చేసి విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. ఏపీ నలుమూల నుంచి తన బంధువులు, స్నేహితులు విషయం తెలుసుకుని ఫోన్లు చేస్తున్నారని బాధితుడు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వరకు రికవరీపై ఎలాంటి పురోగతిలేదని బాధితుడు నరేంద్రనాథరెడ్డి తెలిపారు.

బ్యాంకుల్లోనే భద్రత లేకపోతే..

డబ్బులెక్కడ దాచుకోవాలి

జీతాల డబ్బులు బ్యాంకు ఖాతాల్లోనే పడతాయి. అయితే ఖాతాల్లో ఉన్న డబ్బును ఇలా తమకు తెలియకుండానే కొట్టేస్తుంటే పెద్దమొత్తాల్లో డబ్బులెక్కడ దాచుకోవాలని ఉద్యోగులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిల్లల చదువులకోసం, ఇంటి అవసరాల కోసం, ఈఎంఐలు పోగా మిగిలిన డబ్బును ఇంట్లో దాచుకోలేని పరిస్థితి. మరి అవసరాల కోసం డబ్బులు కావాలంటే ఎలా అని చర్చించుకుంటున్నారు. అప్పుడప్పుడు రూ.5వేలు, రూ.10వేలు కొందరి ఖాతాల నుంచి మాయం కావడం సర్వసాధారణంగా మారింది. దీంతో కొందరు డబ్బులు ఇళ్లలో దాచుకుంటున్నారు. ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలోనే చాకచక్యంగా తలుపులు, బీరువాలు పగలగొట్టి దొంగలు తమపని తాము చేసుకుంటున్నారు. ఇక ఊర్లకు వెళ్లినప్పుడు డబ్బును ఎక్కడ దాచుకోవాలనే ప్రశ్న కూడా ఉత్పన్నమౌతోంది. ముఖ్యంగా పింఛన్ దారుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. తమ డబ్బులు బ్యాంకు ఖాతాల్లోనే దాచుకుని అప్పుడప్పుడు డ్రా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం సైబర్ నేరాల గురించి తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు. లక్షల్లో బ్యాంకు ఖాతాల్లో డబ్బు నిల్వ ఉన్నవారు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి

వాట్సప్, ఇతర మెసేజ్‌ల పట్ల ఖాతాదారులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు, బ్యాంకు అధికారులు హెచ్చరిస్తున్నారు. లోన్ కావాలా అంటూ ఫోన్లు చేసి, ఓటీపీలు చెప్పండి అని అడిగేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్బీఐ, బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే బ్యాంకు అధికారులను, సైబర్ పోలీసులను సంప్రదించాలని అంటున్నారు.



'ఉపాధి' నిధులు దుర్వినియోగం

- చెరువులు, కుంటల్లో పనులు
- కోట్ల రూపాయలు నిధులు దుర్వినియోగం
- పనులు చేసిన చోట.. మళ్లీ పనులు
- చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది

చక్రాయపేట, జూలై 18: పేద బడుగు బలహీన వర్గాల ఉపాధి కల్పన కోసం చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ఈపథకం కేవలం చెరువులకే పరిమితమై పోయింది. ఉపాధి నిధులన్నీ పాపాఘ్ని పాలవుతున్నాయి. ఉపాధిహామీ పథకం 2006లో ప్రారంభించగా.. దాదాపు 18ఏళ్లు అవుతున్నా చెరువులు, కుంటలు, కొండలు, గుట్టల్లోనే గుంతలు తవ్వాల్సి వస్తోంది. వర్షాలు రాగానే చెరువులు నిండిపోయి అలుగు తీసి పాపాఘ్నిలోకి ప్రవహిస్తున్నాయి.

చక్రాయపేట మండలంలో దాదాపు 18 పెద్దచెరువులు, 16 కుంటలు, చెక్‌డ్యామ్‌లాంటివి ఉండగా వాటన్నింటిలో గుంతలు తవ్వాల్సి వచ్చింది. కారణం ఏదైనా పట్టా భూముల్లో స్థలాలు లేక కేవలం చెరువుల్లోనే తవ్వాల్సి వస్తోంది. 2015 వరకు ఈ పథకం అక్కడక్కడ పట్టా భూముల్లోని పొలాల్లో భూగర్భజలాల కోసం డకౌట్ పాండ్స్ తవ్వారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండ గా.. 2600 జాబ్‌కార్డులు ఉంటే.. కేవలం 1500 మంది కంటిన్యూగా చేసే కూలీలు ఉన్నారు. మండలానికి ఇప్పటి వరకు దాదాపు రూ.190 కోట్లు పైబడి నిధులు వచ్చాయి. దాదాపు ఈ నిధులన్నీ కూడా చెరువుల్లో గుంతలు తవ్వడానికి ఉపయోగించడంతో దుర్వినియోగం అయిపోయినట్లేనని స్థానికులు అంటున్నారు. చెరువుల్లో గుంతలు తవ్వడం వల్ల ఎటువంటి ఉపయోగం లేకుండా పోతోంది.


గంగారపువాండ్లపల్లె చెరువులో ఉపాధి పనుల కింద తవ్విన గుంతలు


దేశిరెడ్డి చెరువులో గత ఏడాది తవ్విన గుంతలు పూడిపోవడంతో మళ్లీ పనులు చేస్తున్న దృశ్యం

చేసిన పనులే.. మళ్లీ మళ్లీ చేస్తున్న వైనం

మండలంలో గత ఏడాది పలు చెరువుల్లో ఉపాధి పనులు చేపట్టారు. చేసిన చోట మళ్లీ పనులు చేపట్టడంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. గంగారపువాండ్లపల్లె, దేశిరెడ్డి చెరువులో ఏడాది కింద తవ్విన గుంతలు పూడిపోవడంతో మళ్లీ పనులు చేపట్టారు. అలాగే తిమ్మారెడ్డిపల్లెలోని ఉప్పాలకుంటలో పక్కపక్కన గుంతలు తవ్వుతున్నారు. ఈపనులతో ఎటువంటి ఉపయోగం లేకపోగా.. నిధులు మాత్రం ఖర్చు అవుతున్నాయి. ఇక ఉపాధి పనుల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పనలకు హాజరయ్యే కూలీలు కంటే ఎక్కువ మందిని వచ్చినట్లు చూపుతూ కూలి డబ్బులు మింగేస్తున్నారని సమాచారం.


తిమ్మారెడ్డిపల్లెలోని ఉప్పాలకుంటలో పక్కపక్కన గుంతలు తవ్విన దృశ్యం

వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తే..

ఉపాధి పనులను వ్యవసాయం పనులకు అనుసంధానం చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. రైతులకు కూలీలు ఖర్చు తగ్గి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు కూలీలకు రూ.500 ఇవ్వాల్సి వస్తోంది. అదే ఉపాధి కూలీలను రైతులకు అనుసంధానం చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. ఇక కొండలు, గుట్టల్లో తవ్విన గుంతల్లో పశువులు పడి మృతి చెందుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉపాధి పనులను రైతుకు అనుసంధానం చేయాలని కోరుతున్నారు.



రైతుకు అనుసంధానం చేయాలి

రైతే రాజ్యం అంటారు కానీ రైతును పట్టించుకోరు. కూలీలకు అధి కంగా కూలీలు చెల్లించాలి. దీని వల్ల కూడా పెట్టుబడి పెరుగు తుంది. ఈ తరుణంలో ఉపాధి హామీ పథకం రైతుకు అనుసంధానం చేస్తే ఉపయోకరంగా ఉంటటుందని రైతులు వరినాట్లకు, మామిడి చెట్లు, చీనీచెట్లు తవ్వించుకోవడం, ఎరువులు వేయించుకోవడం తదితర వాటికి ఉపయోగించుకోవచ్చు. ప్రతి ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ఫలితం లేదు.

-వెంకటేశ్వర్లు, కల్లూరుపల్లె, చక్రాయ పేట మండలం.



చేతులు బొబ్బలు వస్తున్నాయి...

ఉపాధి హామీ కింద పట్టా భూముల్లో గుంతలు ఎవరు తవ్వించు కోవడం లేదు. అసలే ఎండాకాలంలో పనులు చేయిస్తారు. మీటర్ లోతు తవ్వాల్సి ఉంటే అడుగు కూడా తవ్వలేకపోతున్నాం. చేతులు బొబ్బలు వస్తున్నాయి. మూడు నెలల నుంచి బిల్లులు రాలేదు. రైతుకు అనుసంధానం చేస్తే ఎంతో బాగుంటుంది.

-రమణ, ఉపాధి కూలి, నాగిరెడ్డిపల్లె, చక్రాయ పేట.

గరుడ వాహనంపై సౌమ్యనాథుడు



నందలూరు, జూలై 18 : సౌమ్యనాథుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సౌమ్యనాథస్వామి మహావిష్ణు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారు గరుడ వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణగా వెళ్లి అనంతరం దిగువవీధి, పేటగడ్డ, బస్టాండ్ మీదుగా అరవపల్లె వరకు గ్రామోత్సవం కొనసాగింది. అరవపల్లెలో ముత్యమారమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన విడిదిలో ఉభయదారులను మంగళవాయిద్యాలతో ఆహ్వానించి పూజలు జరిపించారు. అనంతరం గ్రామోత్సవం అరవపల్లెలోని రైల్వేకాలనీ మరికొన్ని వీధుల్లో ఊరేగుతూ బ్రాహ్మణవీధికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో అత్యం త ప్రత్యేకమైన గరుడసేవను తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సాయంత్రం డోలోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం సౌమ్యనాథస్వామి మోహిని అలంకారంలో శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కరుణించారు. కార్యక్రమంలో గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, చక్రాల రామసుబ్బన్న, జంగంశెట్టి సుబ్బయ్య, మోడపోతుల రాములు పెద్దఎత్తున పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జనసందోహం నడుమ గంధపు పీరు ఊరేగింపు


గంధపు పీరు ఊరేగింపు... కొబ్బరి దివిటీలను వెలిగిస్తున్న దృశ్యం

చిన్నమండెం, జూలై 18: మండల కేంద్రంలోని మఖాన్ వద్ద గత ఏడు రోజులుగా మత గురువులు, మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనల నడుమ నిర్విరామంగా మొహ ర్రం వేడుకలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి 12 గంటల నుంచి జనసందోహం నడుమ పురవీధుల్లో గంధపు పీరును గురువారం తెల్లవారుజామున 7 గంటల వరకు కొబ్బరిదివీటీల నడుమ ఊరేగించారు. గంధపు పీరు ఊరేగింపు సమయంలో మొక్కుబడులు ఉన్న వారు అత్తిరాసాలు, మిఠాయిలు పీరుపై వెదజల్లారు. ఈ ప్రసాదాల కోసం వచ్చిన భక్తులు గంధపు పీరు వెంబడి ఎగబడ్డారు. బుధవారం రాత్రి వివిధ రకాల డప్పు వాయిద్యాలు, బాణాసంచాల నడుమ గంధపు పీరు ఊరేగింపు సాగింది. కార్యక్రమానికి బెంగుళూరు, ముంబై, హైదరాబాద్, చెన్నై నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు, హిందువులు కలిసి సోదర భావంతో, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని సాగించారు.

త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్

కడప (మారుతీనగర్), జూలై 18: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో త్వరలో నాణ్యమైన 4జీ సేవలను అందించనున్నట్లు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) అనంతపురం బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎస్.ముజీబ్ పాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా తమ సంస్థకు దాదాపు లక్ష టవర్లు ఉన్నాయన్నారు. ఆ మేరకు కడప జిల్లాలో 460 టవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని 4జీగా మార్పు చేయడంతో పాటు మరికొన్ని కొత్త టవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 4జీ శాచురేషన్ ప్రాజెక్టులో భాగంగా 143 ప్రదేశాలకు ప్రపోజల్ పంపించగా ఇప్పటికే 46 ప్రదేశాలకు అప్రూవల్ వచ్చిందన్నారు. ట్రయల్ ఆధారంగా జిల్లాలో ఇప్పటికే 20 టవర్లను ప్రారంభించి విజయవంతంగా 4జీ సేవలను అందిస్తున్నామన్నారు. ఇతర ప్రైవేట్ ఆపరేటర్లతో పోలిస్తే అతి తక్కువ ధరలకే బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందించనున్నామన్నారు. జిల్లాలో 2జీ, 3జీ సిమ్‌లు ఉన్నవారు త్వరలో ఉచితంగా 4జీ సిమ్ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏజీఎంలు బాలాజీ, లక్ష్మానాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ క్రికెటర్ విజయ్‌కుమార్‌పై అసోసియేషన్‌లో ఫిర్యాదు


క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీకి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న గురు ప్రసాద్

కడప ఆంధ్రజ్యోతి, జూలై 18: మాజీ ఐపీఎల్, రంజీ ప్లేయర్ పైడికాల్వ విజయ్‌కుమార్‌పై వేంపల్లెకు చెందిన నేతి గురు ప్రసాద్ గురువారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రెడ్డి ప్రసాద్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విజయ్‌కమార్ యువ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. తన కుమారుడైన గురుచరణ్‌ను క్రికెట్‌లో పైస్థాయికి తీసుకెళతానని.. అండర్ -19కి సంబంధించి రాష్ట్రస్థాయిలో మ్యాచ్‌లు ఆడిస్తానని.. కడప పట్టణంలోని డాన్‌బాస్కో గ్రౌండ్‌లో విజయ్ స్థాపించిన అకాడమీలో చేర్పుకున్నారు. అయితే అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి మ్యాచ్‌లో కూడా 11 మంది జట్టులో తన కుమారుడు ఉన్నప్పటికీ మ్యాచ్ ఆడించకుండా.. హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారుడిని మ్యాచ్ ఆడించడంలో విజయ్ కీలకపాత్ర పోషించడాని ఆరోపించారు. హైదరాబాద్ క్రీడాకారులు విజయ్‌కి డబ్బులు ఎక్కువ ముట్టజెప్పారని.. తాము తక్కువ డబ్బులు చెల్లించడం వల్లనే అన్యాయం చేశాడన్నారు. హైదరాబాద్‌కు సంబంధించిన వారిని తన అకాడమీలో చేర్చుకొని జిల్లా క్రీడాకారులకు అన్యాయం చేస్తున్నాడని తెలిపారు. మాలాగే జిల్లాకు సంబంధించిన పలువురి వద్ద విజయ్‌కుమార్ డబ్బులు వసూలు చేశాడని.. అటువంటి వ్యక్తిని నేడు రాష్ట్ర సెలక్టర్‌గా ఎంపిక చేశారన్నారు. దీంతో జిల్లా క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని అసోసియేషన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే విజయ్‌కుమార్‌పై విచారణ జరిపి అసోషియేషన్ నుంచి అతన్ని తొలగించాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రీడింగ్ రైటింగ్ స్కిల్స్ తప్పనిసరి : డీఈవో


మాట్లాడుతున్న డీఈఓ అనురాధ


కడప ఎడ్యుకేషన్, జూలై 18: ప్రతి విద్యార్థికి వారి తరగతికి సంబంధించి చదవడం, రాయడం లాంటి నైపుణ్యాలు కలిగి ఉండాలిన జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ తెలిపారు. గురవారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఏఎల్ఎస్ విశ్వనాథరెడ్డి, హెచ్ఎం నాగమణి ఆద్వర్యంలో ఎస్ఏఎల్‌టీ ప్రాజెక్టులో భాగంగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న వాటిని తరగతి గదిలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తాగునీరు, మెను ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు సాయిరామ్, ఏఏంఓ రామాంజినేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు చిన్నారి మృతి



సిద్దవటం, జూలై 18: మండలంలోని మాచుపల్లి గ్రామానికి చెందిన కందుల భానుశ్రీ(7) పాము కాటుకు మృతి చెందినట్లు చిన్నారి తల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఆమె వివరాల మేరకు... తన కుమార్తె భానుశ్రీ చెల్లితో కలిసి బుధవారం సాయంత్రం ఇంటి పక్కన ఆడుకుంటుండగా ఇటుక పెళ్లను కదిలించడంతో కింద ఉన్న పాము కాటు వేసిందన్నారు. అమ్మతో చెబితే కొడుతుందని.. చెప్పవద్దని చెల్లికి చెప్పి తల నొప్పి ఉందంటూ కింద పడిపోయిందన్నారు. ఈ విషయం తనకు వచ్చి చెప్పిందన్నారు. వెంటనే తన కుమార్తెను కడప ప్రైమ్ ఆసుపత్రికి తరలించామని.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. తన భర్త శ్రీనివాసులురెడ్డి జీవనోపాధి నిమిత్తం కువైట్‌లో ఉన్నాడని ఆమె తెలిపారు.

రైలుకింద పడి యువకుడి మృతి


కిట్టు (ఫైల్ ఫొటో)

కమలాపురం రూరల్, జూలై 18 : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని తూర్పు గండ్లూరు కాలనీకి చెందిన రాజుపాళెం షాలెం (21) అలియాస్ కిట్టు అనే యువకుడు రైలుకింద పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు గురువారం సంఘటనా స్థలం చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు.

రైల్వే ప్రయాణీకులకు ఇబ్బందిలేకుండా చూడాలి

ఎర్రగుంట్ల, జూలై 18: రైల్వే ప్రయాణీకులకు ఇబ్బందిలేకుండా సౌకర్యాలు కల్పించాలని గురువారం సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌ను కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు కోరారు. ఎర్రగుంట్లలో కోచ్ ఇండికేటర్స్ ఏర్పాటు చేయాలని, ప్లాట్‌ఫారాలను శుభ్రంగా ఉంచాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నవీన్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాశం, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత నియమాలు విధిగా పాటించాలి

- నిర్లక్ష్యంతోనే అధిక శాతం ప్రమాదాలు
- ప్రజల సహకారంతోనే నివారణ
- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ


మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్.రమణ

నాగరాజుపేట, జూలై 18: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు విధిగా జాగ్రత్తలు తీసుకోవాలని... అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగానే సంభవిస్తున్నాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ, విజిలెన్స్ విభాగపు సీఐ భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలను నివారించలేమని.. ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రత నియమాలను విధిగా పాటించాలని సూచించారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహనను పెంపొందించాలన్నారు. రైతులు పంట పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరం అని.. పది సంవత్సరాల శిక్ష ఉంటుందని తెలిపారు. వాహన డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి ఎత్తైన లోడ్‌ను తీసుకెళ్లే సమయంలో పైన ఉన్న విద్యుత్ లైన్‌లను గమనించి ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలు ఈదురు గాలులు, వర్షాలకు తెగిపడిన విద్యుత్ వైర్లకు సంబంధించి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నా రు. దగ్గరలోని ఉపకేంద్రాల్లో ఉండే సిబ్బందికి తెలియజేసి వారి ద్వారా మరమ్మత్తులు చేయించుకోవాలని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలన్నారు. విద్యుత్ మోటార్ నుంచి స్టార్టర్ వరకు.. మెయిన్ స్విచ్ వరకు తీసుకెళ్లే వైర్లను భూమి లోపల కాకుండా సుమారు 15 అడుగుల ఎత్తులో కనపడే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొంత మంది ప్రజలు విద్యుత్ కొక్కిల వైర్ల ద్వారా విద్యుత్‌ను తీసుకోవాడం ద్వారా అవి తెగి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉంటుందని.. వాటిని నివారించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి ఖచ్చితంగా ఎర్తు వైర్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇన్సలేషన్ రబ్బరు తొడుగు ఉన్న పనిముట్లను మాత్రమే వాడాలని.. అతుకులు గతుకులు ఉండే వైర్లను వాడరాదన్నారు. ఏవైనా మరమ్మత్తులు చేయాల్సి వస్తే విద్యుత్ అధికారులను సంప్రదించి చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి : కలెక్టర్


డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), జూలై 18 : జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను మరింత ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయుపట్టు అని, ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సూచించా రు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్య లు తీసుకుంటుందన్నారు. పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేస్తున్న వారికి బ్యాంకర్లు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కృష్ణమూర్తి ఐపీఓ, లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజరు జనార్ధన్, డిప్యూటీ కమీషన్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

సమాజంలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లింగ వివక్ష చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలన (పీసీపీ ఎన్డీటీ) పై సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల లింగనిష్పత్తిని బాలురతో పోల్చితే.. బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. సమాజంలో ఆడపిల్లల శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలకు కారకులైన వారికి చట్టపరమైన చర్యలు, శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో, ఆసుపత్రులలో లింగ నిర్ధారణ, భ్రూణహత్యలు చేయడం, ఆడపిల్ల వద్దంటూ కుటుంబంలో ఎవరైనా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆధారాలతో తెలియజేస్తే వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు, పీసీసీ ఎన్డీటీ నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, సభ్యులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, పోలీసు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి

గర్భిణీలపై ప్రత్యేక పర్యవేక్షణతో పాటు వైద్యులు ఐసీడీఎస్ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించినపుడే ప్రసూతి సమయంలో మాతృమరణాలను అరికట్టగలమని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లాస్థాయి ప్రసూతి మరణాల విచారణ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతానికి తీసుకొచ్చేందుకు వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. మాతృమరణాల వివరాలను, కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 18: రాయచోటి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను ముస్లిం మైనార్టీలు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. గురువారం రాయచోటి పట్టణంలోని జామియా మసీదు కాంప్లెక్స్‌లో షాహీ జామియా మసిద్ కమిటీ, జమియత్ ఉలేమాయే హింద్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నేతలు మాట్లాడుతూ పట్టణంలోని దిబ్బల బిడికి సమీపంలో మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణం కోసం 1.5 ఎకరాల జాగాను కేటాయించి అందులో భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.14 కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల చేయకుండా పేపర్లకే పరిమితం చేశారని చెప్పారు. దీంతో అక్కడ డిగ్రీ చదువుతున్న బాలికలు మౌలిక సదుపాయాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాసాపేటలో 2019 సంవత్సరంలో మైనార్టీల సంక్షేమం కోసం రూ.39 కోట్లతో మైనార్టీ గురుకుల పాఠశాల నిర్మాణం కొరకు పనులు ప్రారంభించి పునాదులకే పరిమితం చేశారన్నారు. అలాగే రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె, మహబూబ్‌నగర్, రాజులకాలనీ, ఎస్టీ కాలనీ, ఆదిల్‌నగర్, రెడ్డీకాలనీల్లో నెలకొన్న సమస్యలను మంత్రికి వివరించారు. అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు.

భూ బకాసురుల భరతం పడతాం

● కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 18: భూ బకాసురుల భరతం పడతామని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ద్వారకానగర్‌లోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో కడప నగరానికి చుట్టుపక్కలా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు స్థలాలు, కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, ఇసుక, మట్టిని సైతం యథేచ్ఛగా ఆక్రమించి సొమ్ము చేసుకున్నారన్నారు. వైసీపీ చోటామోటా నాయకుల నుంచి ఎమ్మెల్యేల వరకు ఆక్రమించుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. అలాంటి భూ బకాసురుల భరతం పట్టేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర చోటా మోటా నాయకులంతా ఇసుక, మట్టి నుంచి ప్రభుత్వ స్థలాలు, భూములు, వాగులు, వంకలు కొండలు, గుట్టలు కొల్లగొట్టి లక్షలాది కోట్ల రూపాయలు దండుకున్నారన్నారు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయడమే పనిగా పెట్టుకన్నారని ని ప్పులు చెరిగారు. ఆ పరంపరలో సుమారు 1.75 వేల ఎకరాల భూములను ఇష్టానుసారంగా అమ్ముకుని రూ. 35వేల కోట్ల పైచిలుకు డబ్బును ఆర్జించారని ధ్వజమెత్తారు. ఏదిఏమైనా ఆ భూ బకాసురుల భరతం పట్టేందు కు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగా రాష్ట్రవ్యా ప్తంగా ఇంటి పట్టాల పేరుతో సుమారు 10వేల ఎకరాలకు పైగా భూములను కబ్జాచేశారన్నారు. ఇసుక అక్రమ ర వాణా ద్వారా మరో రూ.10వేల కోట్లు దండుకున్నారన్నా రు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వీరు ఆక్రమించుకున్న భూములను రెగ్యులర్ చేసుకునేందుకు జీఓ నెం బర్ 512ను తెరపైకి తెచ్చారన్నారు. కడప నగరంలో ఆక్రమించుకున్న భూ భాగోతం బహిర్గతం చేస్తామన్నారు. నగరంలోని మినిస్టర్ లేఔట్‌లో వైసీపీ మాజీ మంత్రి ఆక్రమించుకున్న భూములున్నాయన్నారు. ఇందులో ఆక్రమించుకున్న భూములమీద బోర్డులు పెట్టించగా ఆయన తొత్తులొచ్చి బోర్డులను తొలగించారన్నారు. వారిపై కేసులు పెడతామన్నారు. ఆ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు వేయిస్తామన్నారు. టిప్పర్లద్వారా ఇసుకను దోపిడీ చేసినా గత వైసీపీ పాలనలో ఏ మాత్రం చొరవ చూపిన దాఖలాలు లేవన్నారు. కడపలో పోలీసు స్థలాలు, జడ్పీ భూములను కూడా ఆక్రమించుకున్నారన్నారు. దీన్ని ప్రజలు గమనించాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో కొందరు చోటా వైసీపీ నాయకులు వాటర్‌ప్లాంట్స్ ఏర్పాటు చేసుకుని నీటి వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. దీనిపై అధికారులతో సమగ్ర విచారణ చేపట్టి తద్వారా ప్రజలకు అవసరైన వాటిని ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు జిలానీ బాషా, గోపాల్‌రెడ్డి, నిత్యపూజయ్య పాల్గొన్నారు.

అక్రమాలు, అరాచకాలతోనే వైసీపీ ఓటమి

● కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్య రెడ్డి

కమలాపురం రూరల్, జూలై18:రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమాలు అరాచకాలు చూసే ప్రజలు ఓడించారని ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేసిన శ్వేత పత్రంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. హౌసింగ్ కాలనీలో పేరుతో రైతుల వద్ద నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మడమే కాకుండా వైసీపీ వారు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న భూములను సెటిల్ చేసుకోవడం కోసం దేశంలో ఎక్కడా లేని ల్యాండ్ టైటలింగ్ యాక్టును తీసుకొచ్చిందన్నారు. వైసీపీ చేసిన అక్రమాలు, అన్యాయాలు చూసి జనం ఓటు ద్వారా బుద్ధి చెప్పారన్నారు. జగనన్న కాలనీల పేరుతో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే భూమిని ప్రభుత్వానికి అమ్మడమే కాకుండా ఆ చుట్టు పక్కల వైసీపీ నాయకులు వెంచర్‌లు ఏర్పాటు చేశారన్నారు. రామానాయుడు స్టూడియో భూములను కూడా కబ్జా చేశారని, అంతేగాకుండా దేవదాయశాఖ భూములను కూడా కబ్జా చేశారన్నారు. ఇలాంటి అక్రమాలు ఇకపై జరగకుండా ఉండడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడుం బిగించారన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువనాయకుడు లక్ష్మీరెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జాది రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు అంకితభావంతో పనిచేయండి

లింగాల, జూలై 18: కుష్ఠు వ్యాధి నివారణకు అంకితభావంతో పనిచేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ కళ్యాణ్ దినకర్ సూచించారు. మండలంలో గురువారం ప్రారంభమైన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (ఎస్‌సీడీసీ) కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కేటాయించిన గృహాలను సందర్శించి ప్రతి కుటుంబ సభ్యులను పరిశీలించారు. చర్మం మీద స్పర్శలేనిమచ్చలు, కనురెప్పలు మూ తపడకపోవడం, కాళ్లు-చేతులుతిమ్మిర్లు లేక జోములు కలిగిఉండడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం లాంటివని పేర్కొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

పెండ్లిమర్రి, జూలై 18: మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, రిటైర్డ్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుణశేఖర్‌లు సూచించారు. గురువారం మండలంలోని ఇసుకపల్లె, ఎగువపల్లె గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చదువు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాక్షించారు. దేశ జనాభాలో యువత 33శాతం ఉందని, ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదని తెలిపారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యక్తిత్వవికాసంపై విరివిగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. హెచ్‌ఎంలు అపర్ణ, శివమోహన్, స్టెప్ మేనేజర్ వివి సుబ్బరాయుడు, జూనియర్ అసిస్టెంట్ నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

సీకేదిన్నె, జూలై 18: రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం కొలుములపల్లె పంచాయతీ కార్యదర్శి నారాయణ రెడ్డికి సూపర్-6 హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి మెజార్టీతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రైతులకు రబీ సీజన్‌లో వర్షాభావంతో కరువుతో ఇబ్బందులు పడుతున్నారని రైతులకు పెట్టుబడిసాయం అందించి ఆదుకోవాలన్నారు.

ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

చెన్నూరు, జూలై 18: చెన్నూరులో ఇటీవల విద్యుత్ వినియోగం పెరగడంతో అదనపు లోడ్‌ను తగ్గించేందుకు ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైనట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. ఇందులో చెన్నూరు బుడ్డాయపల్లె రోడ్డులో ఇప్పటి వరకు ఉన్న 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, నాగులకట్ట, బెస్తకాలనీ, మైనార్టీ కాలనీ, చెక్కర చెట్టు వీధి, వనం వీధి, మైనార్టీ వీధి, రామదాస్ కాలనీలలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీల ట్రాన్స్‌ఫార్మర్లు, అలాగే శ్రీరామ్ నగర్ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అధనంగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మెటీరియల్ రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూలై 18: ప్రజాసమస్యలు పరిష్కరించడం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు తమ సమస్యలను బీటెక్ రవికి చెప్పుకొన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతుకృషి చేస్తానని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

కడప (మారుతీనగర్), జూలై 18: అన్నమయ్య జిల్లా మదనపల్లి హార్సిలీహిల్స్‌లో ఈనెల 24, 25, 26 తేదీలలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు సమక్షంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ప్రభుత్వం ఉపక్రమించాలని కోరారు.

21న బండలాగుడు పోటీలు

వేముల, జూలై 18: మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో శ్రీగణపతి, దత్తాత్రేయ సహిత శ్రీషిరిడీసాయి బాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 21న ఉదయం 7గంటల నుంచి పూజా కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అన్నదాన కార్యక్రమం భారీఎత్తున ఉంటుందన్నారు. అలాగే ఒంగోలు జాతి వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిది బహుమతుల వరకు వరుసగా రూ.1లక్ష, రూ.80వేలు, రూ.60 వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు బహుమతులు అందించనున్నారు. పాల్గొన్న ప్రతి వృషభరాజములకు కన్సలేషన్ బహుమతి ఉంటుందన్నారు.

బోగస్ పింఛన్లను ఏరివేయాలి

పులివెందుల టౌన్, జూలై 18: పులివెందుల నియోజకవర్గంలో ఉన్న బోగస్ పింఛన్లను ఏరియావేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పులివెందులలో ఆయనమాట్లాడుతూ వైసీపీపాలనలో పింఛన్‌దారుల ఎంపికలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. వైకల్యం లేకపోయిన, ఎక్కువ భూములు ఉన్న, వయసు తక్కువగా ఉన్న పింఛన్లకు ఎంపికచేసి అర్హులైన పింఛన్‌దారులకు మొండిచేయి చూపించారన్నారు. ఒక రేషన్‌కార్డుపై ఒక పిచన్ మాత్రమే అర్హతగా ఉంది. కానీ ఒకే ఇంట్లో ఇద్దరు చొప్పునపింఛన్లు పొందుతున్నారన్నారు. బోగస్ సర్టిఫికేట్లతో పింఛన్ పొందుతున్నారన్నారు. ఇలాంటి వాటిని ఏరివేయాలని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

వేంపల్లె, జూలై 18: వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో చదివే ఇంటర్ విద్యార్థినులకు గురువారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తెలుగు అధ్యాపకుడు చెరుకూరు శ్రీనివాసులు 55 మంది విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ సమకూర్చి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథాచేసుకోకుండా కష్టపడి చదవాలన్నారు. లక్ష్య సాధనకు చేరుకున్నప్పుడే మెరుగైన భవిష్యత్తు ఉంటుందని, ఎంతో ఆనందం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వెంకట్, గురునాథ్‌రెడ్డి, సురే ష్‌కుమార్‌రెడ్డి, రమేష్, రెడ్డిసాయి పాల్గొన్నారు.

ఆరుబయట మలమూత్ర విసర్జన చేయరాదు

వల్లూరు, జూలై 18: ఆరుబయట మలమూత్ర విసర్జన చేయరాదని ఎంపీడీఓ జ్యోతి పేర్కొన్నారు. గోటూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం ఎంపికి చేసినట్లు తెలిపారు. గురువారం ఎంపీడీఓ ఆ గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి అని, ఒక వేళ ఎవరైన మరుగుదొడ్డి లేకుంటే తక్షణం నిర్మించుకోవాలన్నారు. పొడిచెత్త, తడిచెత్తలను వేరు చేసేందుకు ప్లాస్టిక్ టబ్బులను ఇంటింటికి అందజేసినట్లు తెలిపారు. చెత్తను తన ఇంటి వద్దకు వచ్చే గ్రీన్ అంబాజిడర్‌లకు ఇవ్వాలని సూచించారు. గోటూరు గ్రామంలో ఇప్పటికి తాము 50 ఇండ్లకు పైగా సర్వే చేశామని తెలిపారు. ఇంకా పూర్తి స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలిస్తామన్నారు. గోటూరును ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామ న్నారు. వీరి వెంట వల్లూరు ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఈఓఆర్‌డీలు ప్రసాద్, శారదమ్మ, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సునీత, గోటూరు గ్రామ సెక్రటరీ కరీముల్లా, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులరెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'సమస్యలుంటే తెలియజేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న సుంకర శ్రీనివాస్

కడప (సెవన్‌రోడ్స్), జూలై 18: ఏవైనా సమస్యలుంటే తమకు తెలియజేయాలని ఉమ్మడి కడప జిల్లా కో ఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని జనసేన జిల్లా కార్యాలయంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలను తమ పార్టీ కార్యాలయానికి ఫోన్ ద్వారా తెలియపరిస్తే పరిష్కారానికి శ్రద్ధ చూపుతామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సురేష్‌బాబు విశ్వనాథ్, బి.నాగేంద్ర, సుబ్బరాయుడు, వెంకటేష్, సాయి పాల్గొన్నారు.

పత్తిలో రసంపీల్చే పురుగులను నివారించండి

వీరపునాయునిపల్లె, జూలై 18: పత్తి పంటలో రసంపీల్చే పురుగులనుని నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్యామ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని ఎన్.పాలగిరి గ్రామంలో సాగుచేసిన పత్తి పంటను ఆయన పరిశీలించారు. రసం పీల్చే పురుగులైన తామరపురుగులు, నల్లి, పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. నివారణకు మందులను సూచించారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి పొందొచ్చన్నారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య



కడప (క్రైం), జూలై 18: కడప, కనుమలోపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. ఆ యువకుడికి 25 సంవత్సారాల వయస్సు ఉంటుందని, జేబులో ఫోటో ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు


వేములలో పీర్ల ఊరేగింపు

వేముల, జూలై 18: వేములలో గురువారం మొహర్రం సం దర్భంగా పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున ముస్లం, హిందు సోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చు ట్టుపక్కల గ్రామాల ప్రజలుపీర్ల ఊరేగింపులో వవిధ వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను ఆకట్టుకున్నారు.హిందు, ముస్లింల ఐక్యతను చాటుతూ ప్రజలు పెద్దఎత్తున పాల్గొనడంతో పీర్ల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి హాజరై పీర్లకుపూజలు చేశారు. గుర్రపు స్వారీ చేస్తూ భక్తులను ఉర్రూతలూగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెరిగిన పీజీ వైద్యసీట్లు


ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

కడప (సెవన్‌రోడ్స్), జూల్ 18: కడప వైద్య కళాశాల నందు (రిమ్స్) జనరల్ సర్జరీ విభాగానికి 6 పీజీ సీట్లు, గైనకాలజీ విభాగానికి 1 పీజీ సీటు మంజూరు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక రిమ్స్ నందు సంబంధిత జనరల్ సర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ వాణి, వారి సిబ్బంది, ప్రిన్సిపాల్‌ను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అదనపు సీట్ల భర్తీద్వారా వచ్చే వైద్యులు సేవలందించగలరన్నారు.

ఎంఈఓ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలి

కడప (మారుతీనగర్) జులై 18. ఎంఈఓ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. గురువారం ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల్లో పదవీ విరమణ పొందిన మండల విద్యాశాఖాధికారుల స్థానంలో ప్రధానోపాధ్యాయులు, ఇతర మండల విద్యాశాఖాధికారులు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో వారిపై పని భారం మరింత ఎక్కువై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు.
కావున పదోన్నతుల ద్వారా రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఓజాస్ అహ్మద్, ప్రబాకర్ చంద్రశేఖర్, సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి శివశంకర్, సమీర్, నాగరాజు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రమాదాలను నివారించండి




కడప: వన్ కె వాక్‌ను ప్రారంభిసున్న జడ్జి ప్రత్యూషకుమారి... కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కడప(రూరల్) జూలై 18 : ద్విచక్ర వాహనదారులు, పిలియన్ డ్రైవర్ వినియోగదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించాలని డీఎల్‌ఎస్‌ఏ ఎఫ్‌ఏసీ సెక్రటరీ, అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ నుంచి బిల్టప్ సర్కిల్ వరకు హెల్మెట్ ఉపయోగంపై వన్ కె వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మనల్ని, మన కుటుంబాన్ని రక్షించుకోవాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల న్నారు. ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. రోడ్డు భద్రతా నియమావళిని పాటించాలన్నారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, పారాలీగల్ వాలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఎన్జీవోలు, ప్రజలు పాల్గొన్నారు.
సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో... జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో గురువారం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు.
కమలాపురంలో... ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రా ణాలు కాపాడుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి లావణ్య తెలిపారు. గురువారం న్యాయవాదుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు సిబ్బందితో పాటు పోలీసులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుష్పరాజు, మున్సిపల్ స్టాం డింగ్ కౌన్సిల్ కె.రవీంద్రప్రసాద్, న్యాయవాది నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి ఉదయ్‌కిరణ్, మహేష్, బాబు, శివ పాల్గొన్నారు.

29 నుంచి రాష్ట్ర సమ్మేళనాలు

కడప (సెవెన్ రోడ్స్), జూలై 18: మదనపల్లెలో ఈనెల 29 నుంచి 31వరకు రాష్ట్ర స్థాయి రైతు సమ్మేనాలు జరగనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ సమ్మేళనాలు జరు గుతున్నట్లు తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి

పులివెందుల రూరల్, జూలై 18: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై దృష్టిసారించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దివాకర్ సూచించారు. గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షన నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

దళితులపై దాడులు, దౌర్జన్యాలను ఆపాలి

● రౌండుటేబుల్ సమావేశంలో జిల్లా దళిత ఫోరం చైర్మన్ కిశోర్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా దళిత ఫోరం చైర్మన్ కిశోర్‌కుమార్

నాగరాజుపేట, జూలై 18: దళితులపె దాడులు, దౌర్జన్యాలను వెంటనే ఆపాలని, లేకుంటే పోరాటాలకు సిద్ధమని దళిత ఫోరం చైర్మన్ కిశోర్‌కుమార్ హెచ్చరించారు. గురువారం దళిత ఫోరం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'దళితులపై దాడులు- తీసుకోవాల్సిన చర్యలు' అన్న అంశంపై ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరుకు చెందిన దళితుడు కదిరి ప్రభాకర్‌కు జరిగిన నష్టానికి బాధ్యత వహిస్తూ ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, మూడు ఎకరాల సాగు భూమి, రూ.20 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ తక్షణమే కలెక్టర్, ఎస్పీలు ఈ దాడులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఎస్పీ నాయకులు సగిలి గుర్రప్ప మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారిని అగ్రవర్ణాలవారు వేధిస్తున్నారన్నారు. రాయలసీమ ఎస్సీ, ఎస్టీ, హ్యూమన్ రైట్స్ ఫోరం కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ ఇంత వరకు ఆ గ్రామానికి పోలీసులు కానీ, ప్రభుత్వ అధికారులు కానీ పోకపోవడం దళితుల పట్ల వారి నిర్లక్ష్యైఖరి అర్థమవుతోందన్నారు. చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ బాధితుడు ప్రభాకర్‌కు మెరుగైన వైద్యం అందించి ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సూచించారు. టీడీపీ దళిత నాయకుడు కొండా సుబ్బయ్య మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సీపీఎం నాయకుడు రామ్మోహన్ మాట్లాడుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. వెంకటసుబ్బారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హేతువాద సంఘం నాయకుడు సీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి దాడులు భవిష్యత్‌లో జరగకుండా ఉండాలంటే దళితులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో చుండూరు, కారంచేడులలో జరిగిన దాడులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. గ్రేటర్ రాయలసీమ నాయకుడు ఓబయ్య మాట్లాడుతూ దళితుల ఉద్యమాలకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడు డబ్ల్యూ రాము, దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి కానిగల మునెయ్య, పాలగేరి చంద్రగుప్త, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసులు, ప్రధా న కార్యదర్శి స్వర్ణలక్ష్మీనారాయణ, వెంకటరమణ, రవికుమార్, అంజి, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా సేవలందించాలి

అధికారులు నిద్రావస్థ నుంచి బయట పడాలి ● రోడ్లు, తాగునీరు, ఉపాధి పనులపై ప్రశ్నించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు మండల సమావేశంలో ఆసక్తిదాయక చర్చ





మండల సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి - పాల్గొన్న సర్పంచులు ఎంపీటీసీలు, మండల అధికారులు

ప్రొద్దుటూరు, జూలై 18: ఉద్యోగులు జీతం తీసుకుంటున్నది ప్రజలకు బాధ్యతంగా సేవలు అందించడానికని, అధికారులు నిద్రావస్థ నుంచి బయట పడాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సూచించారు. మండల కార్యాలయ సభా భవనంలో మండల అధ్యక్షుడు సానబోయిన శేఖర్‌యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులపై సమీక్షించాలన్నారు. ఏటా తీసిన కాల్వ తీసి ఉపాధి బిల్లులు చేసుకుంటున్నారన్నారు. సమావేశం పెట్టి ఏ పనులు చేపట్టాలో రైతులతో మాట్లాడి వారి తీర్మానం మేరకు పనులు పెట్టాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభరత్ రెడ్డి మాట్లాడుతూ చెన్నమరాజుపల్లె, నాగాయపల్లె, చౌడూరు, హౌసింగ్ బోర్డు కాలనీ భగత్ సింగ్‌కాలనీ, యానాదికాలనీ, ఖాదరబాదర అమృతానగర్, టీచర్స్ కాలనీ, ప్రకాష్‌నగర్ వివేకానందనగర్‌లలో కోట్ల రూపాలయతో తాగునీటి పైపులైను పనులు పెట్టామన్నారు. కలుషిత నీటితో డయేరియా ప్రలుతుందని, రిజర్వాయర్లలో బ్లీచింగ్ కలపకుండా తాగునీటి సరఫరా చేయరాదన్నారు. సర్పంచులు ఎంపీటీసీలు చొరవ చూపి శుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి మండలంలో అందించిన పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాల గురించి వివరించగా వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళుతున్నారా రైతులతో మాట్లాడి వారికి సరైన సలహాలు ఇస్తున్నారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రైతులకు జరిగే పంట దోపిడీపై మార్కెట్ యార్డు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కల్లూరు కామనూరు పీహెచ్‌సీ కేంద్రాల్లో వైద్యాధికారులు సిబ్బంది పనితీరుపై చర్చించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలపై హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యంను ప్రశ్నించారు. ఆయన సరైన నివేదిక అందిచలేక పోగా డీఈ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తయితే లబ్ధిదారులు ఎందుకు చేరలేదో సమాధానం చెప్పాలన్నారు. కేవలం స్లాబులు పూర్తి చేశామని ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, కార్పెంటరీ, ప్లంబింగ్ ఎలక్ట్రికల్, పనులు చేయలేదని ఏఈ తెలిపారు. నాడు నేడు కింద చేపట్టిన స్కూలు బిల్డింగ్‌లు అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంఈఓలను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో నాసిరకం రోడ్ల నిర్మాణంపై ప్రశ్నించారు. రూ.30 కోట్లతో 15 గ్రామాలకు రోడ్ల ప్రతిపాదనలపై చర్చించారు. విద్యుత్ సబ్‌స్టేషన్లకు స్థలాల కొరతపై చర్చించి మూడు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లు, 132 కేవీ స్టేషన్ పనులను ప్రారంభించాలని స్థలాలకు అనుమతులు ఇప్పిస్తానని తెలిపారు. ఆర్టీసీ బస్సులు గ్రామాల్లో తిప్పాలని ఆదేశించారు. సమావేశానికి రాని అధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ శారద, డీఎల్‌డీఓ సుబ్రమణ్యం, ఎంపీడీఓ కుళాయమ్మ, తహసీల్దారు విద్యాసాగర్, పంచాయితీ కార్యదర్శులు వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు మేలు జరిగేలా సబ్సిడీ సరుకులు

పేదలు సబ్సిడీ సరుకులు సద్వినియోగం చేసుకోవాలి ● ప్రతి పథకం న్యాయంగా జరుగుతుంది

● జమ్మలమడుగు, ముద్దనూరు మార్ట్‌లలో సబ్సిడీ దుకాణం ప్రారంభించిన ఎమ్మెల్యే



జమ్మలమడుగులో సబ్సిడీ కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్

జమ్మలమడుగు, జూలై 18: ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని మిల్లర్లతో సమావేశమై పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరిగేలా సబ్సిడీతో సరుకులు అందించే పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక బి.మార్ట్‌లో సబ్సిడీ బియ్యం, కందిపప్పు దుకాణం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ అన్ని పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అప్పు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఉపయోగపడేలా తక్కువ ధరకు సరుకులు అందిస్తోందన్నారు. ప్రజలు గతంలో అధిక ధరలతో ఇబ్బంది పడ్డారని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఉండకూడదని చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం తాడిపత్రిరోడ్డులో బి.మార్ట్, మోరగుడి మూడు రోడ్ల కూడలి సమీప కె.మార్ట్‌లలో సబ్సిడీ పథకాన్ని ప్రారంభించి పేదలకు కందిపప్పు, బియ్యం అందించారు. ఆర్డీఓ శ్రీనివాస్, దేవగుడి గోవర్ధన్ రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, సంతోష్, డి.షబ్బీర్, కొమెర్ల రామలింగారెడ్డి, మంత్రి శ్రీను, తహసీల్దారు కరుణాకర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరదకిశోర్‌రెడ్డి, ఆర్‌ఐ రోహిత్, పోలీసు చంద్ర, బి.మార్ట్ యజమాని మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్టుల్లో సబ్సిడీతో నిత్యావసరాలు

ముద్దనూరు జూలై18: ప్రముఖ మార్టుల్లో ప్రభుత్వం సబ్సిడీతో నిత్యావసరాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గాయత్రీ, సూపర్- కె మాల్స్‌లలో సబ్సిడీ నిత్యావసరాలను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి హైవే పనులు జరుగుతున్నాయని, పులివెందుల పనులు మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పుణ్యాన నిలిచిపోయాయన్నారు. బయటి కన్నా తక్కువ ధరలో నాణ్యమైన కందిపప్పు కిలో రూ.160, కిలో సన్న బియ్యం రూ.49కి మార్టుల ద్వారా అందిస్తున్నామన్నారు. ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దారు సువర్ణాదేవి, బీజేపీ, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దొంగగా ఇసుక తోలుతామంటే కుదరదు'

ఎర్రగుంట్ల, జూలై 18: దొంగ ఇసుక తోలుతామంటే కుదరదని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తేల్చి చెప్పారు. ప్రభుత్వ పాలసీ మేరకే ఇసుకను సరఫరా చేసుకోవాలన్నారు. టీఎంఆర్ మాల్‌లో టీడీపీ నియోజకవర్గ ఇచ్‌చార్జి సి.భూపేష్‌రెడ్డితో కలిసి సబ్సిడీపై కందిపప్పును ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన జగన్ పరిపాలను ఏకిపారేశారు. జగన్ ప్రభుత్వంపై ఇప్పటికే నాలుగు శ్వేతపత్రాలు విడుదల చేశారు. మరో మూడు విడుదల చేస్తారన్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులివ్వలేదు. అభివృద్ధి ఎలా జరుగుతందని ప్రశ్నించాడు. రాష్ట్ర ప్రభుత్వ కొత్త పంథాలో వెళుతోందన్నారు. అర్హులందరికీ లబ్ధిచేకూరేలా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఎర్రగుంట్లలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌ను అందరికీ దక్కేలా చూస్తామన్నారు. త్రీ ఫేస్ కరెంట్ 12గంటలూ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, కూటమి నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జోరుగా వర్షం - రహదారులు జలమయం



ఆర్టీసి బస్టాండ్ వద్ద నిల్వ ఉన్న వర్షపు నీరు

పోరుమామిళ్ల, జూలై 18: పోరుమామిళ్లలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లు జలమయమై వాహనదారులకు ఇబ్బంది కలిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు మెదలైన వాన ఎడతెరిపిలేకుండా కురవడంతో ప్రధాన రహదారుల మధ్య ఉన్న గుంతలన్నీ వర్షం నీటితో కుంటలను తలపించాయి. బద్వేలు రహదారిలో కమ్మవారి పల్లె సమీపంలో ఈ వర్షం నీటికి రహదారే కనిపించకుండా పోయింది. అంబేడ్కర్ సర్కిల్ ఆర్టీసీ బస్టాండ్, సాయిబాబ దేవాలయం దగ్గర మహాత్మా గాంధీ విగ్రహం వెనకవైపున ఉన్న షాపుల దగ్గర వర్షం నీరు నిండిపోయి పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులకు కలిగించాయి. వర్షం కారణంగా ప్రైవేట్ పాఠశాలలు నాలుగు గంటలకే వదిలివేయడంతో విద్యార్థులు గమ్యస్థానాలు చేరడంలో తడిసి ముద్ద కావాల్సిన పరిస్థితి. చాలా రోజులకు ఒక పదును వర్షం కురిసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఆలయ అభివృద్ధికి అడ్డంకులు తొలగిస్తా'

కాశినాయన,జులై18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతి క్షేత్రంలో కాశినా యన ఆలయ నిర్మాణా నికున్న ఫారెస్ట్ అడ్డం కులను తొలగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లతో మాట్లాడి ఆలయ నిర్మానికి కృషిచేస్తామని మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ, టీడీపీనేత రితీష్‌రెడ్డి, బీజేపీ నేత బొజ్జారోశన్న, జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జ్యోతి క్షేత్రాన్ని సందర్శించి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో ఆలయ ట్రస్టు సభ్యులు, భక్తులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆలయ స్థితిగతులు, ఇప్పటి వరకు ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం చేసిన ప్రయత్నాలు, ఇకపై చేయాల్సిన పనులు, చేప ట్టాల్సిన చర్యలపై జర్చించారు. పలువురు కాశినాయన భక్తులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం

ప్రొద్దుటూరు, జూలై 18: స్థానిక కోఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ చైర్మెన్ వెల్లాల కుమార్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. పలువురు డెరెక్టర్లు డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ప్రభాకర్‌రావుకు గురువారం సాయంత్రం అందజేశారు. ఈమేరకు ఆయన నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

ఎయిర్ గన్‌తో కాల్పులు మేకకు గాయాలు

పోరుమామిళ్ళ, జూలై 18: అక్కలరెడ్డిపల్లె సమీపంలో ఓ యువకుడు తన వద్ద ఉన్న ఎయిర్ గన్‌తో కాల్పులు జరపడంతో మేతకు వెళ్ళిన ఓ మేకకు గాయాలయ్యాయి. మేకల యజమాని గురవారం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరుపుతున్నామని, ఎయిర్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తిమోతి తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ట్రిపుల్ రైడింగ్ నడపరాదు ● లైసెన్సు దారులే వాహనం నడపాలి

● జడ్జి భార్గవి ఆధ్వర్యంలో జమ్మలమడుగులో ర్యాలీ ● నినదించిన అధికారులు





జమ్మలమడుగులో హెల్మెట్‌పై ర్యాలీ చేస్తున్న జడ్జి,అధికారులు - పాత బస్టాండులో ఆకట్టుకున్న జడ్జి భార్గవి, న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థుల మానవహారం

జమ్మలమడుగు, జూలై 18: ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి, లైసెన్స్ కలిగి ప్రయాణించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. జమ్మలమడుగు కోర్టు నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, విద్యార్థులు హెల్మెట్ ప్రాముఖ్యతపై గురువారం ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండులో జడ్జి భార్గవి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మానవహారంగా నిలబడ్డారు. కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు లైసెన్సు పొంది ద్విచక్ర వాహనాలు నడపాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు బైక్ ఇచ్చే సమయంలో హెల్మెట్ ధరించాలని జాగ్రత్తలు తెలపాలని, రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఎస్ఈబీ సీఐ లత మాట్లాడుతూ సమాజంలో వాహనం లేనిది జీవనం జరగడం లేదన్నారు. అలాగని చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులే సమస్యలను కొనితెచ్చుకుంటున్నారన్నారు. రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అతి వేగం ప్రాణహాణి అని, హెల్మెట్ లేనిది వాహనం నడపరాదన్నారు. మహిళలు, విద్యార్థులు, ఇతరులు వాహన రూల్స్‌ను పాటించాలన్నారు. ప్రతి వాహనదారునికి లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, జంబాపురం మహేశ్వరి, సూర్యపెద్దిరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు వై.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్, సీనియర్ న్యాయవాది మునిసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రమాదాలు నివారించండి

బద్వేల్ రూరల్, జూలై 18: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాలు నివారించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి కోరారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రమాదాల బారిన పడ్డవారు ఎప్పుడైనా ఇన్సూరెన్స్ దాఖలు చేసుకునే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఆరు నెలల్లోపే క్లైమ్ చేసుకోవాల్సి ఉండడంతో బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోర్టు సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ ఇంట్లో సోదాలు



సోదాలు చేస్తున్న అధికారులు

ముద్దనూరు జూలై18:డ్వాక్రా సంఘ సభ్యులను బురిడీ కొట్టించి సొమ్ము స్వాహా చేసి అజ్ఞాతంలోనున్న యానిమేటర్ మల్లిక ఇంట్లో గురువారం పోలీసుల సమక్షంలో ఎంపీడీఓ చంద్రమౌళి, వెలుగు ఏపీఎం ఇబ్రహీం సిబ్బంది సోదాలు చేశారు. వీఓ, గ్రూపులకు సంబంధించి బుక్సు మల్లిక వద్ద ఉండడంతో అధికారులు సోదాలు నిర్వహించారు. ఇంట్లో గ్రూపుల పుస్తకాలు చెల్లాచెదురుగా పడిఉండడంతో వాటిని అధికారులు మల్లిక కుటుంబ సభ్యులు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అయితే వీఓకు సంబంధించి అసలైన పుస్తకాలు లభించనట్లు తెలిసింది.

జనసేన పార్టీని బలోపేతం చేయాలి

బద్వేలు, జూలై 18: జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని జనసేన బద్వేలు కో ఆర్డినేటర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభించారు. జనసేన సైనికులు వీరమహిళలు సభ్యత్వం నమోదు చేసుకోవాలని, సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా కల్పిస్తారన్నారు. బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా పదివేలు సభ్యత్వాలు నమోదు చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు డి.వెంకటేశ్వర్లు, సురేంద్ర, శింగంశెట్టి వెంకటసుబ్బయ్య, రమణయాదవ్, సునీల్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు పట్టణంలోనే పశువుల సంత

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పుట్టా

మైదుకూరు రూరల్ జూలై 18: రేపు జరిగే సంత పట్టణంలోనే జరుగుతుంది. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకొనేందుకు కట్టుబడి పశువుల సంతను మార్చేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో పశువుల సంతను బద్వేల్ రోడ్డులోని గగ్గితిప్ప వద్దకు తలించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంతను నంద్యాల రోడ్డులోని పాత స్థలంలోకే తరలిస్తామని పుట్టా ప్రజలకు మాట చెప్పారు. ఆ మాటకు కట్టుబడి శనివారం సంతను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మైనార్టీ మంత్రిని కలిసిన గౌస్

ఖాజీపేట, జూలై 18: గత ప్రభుత్వం మైనార్టీలకు మోసం చేసిందని, మన ప్రభుత్వంలో న్యాయం చేయాలని మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు మైనార్టీ సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ వినతి పత్రం అందజేశారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన వారు ఫోన్‌లో మాట్లాడుతూ దుల్హాన్ పథకానికి వైసీపీ ప్రభుత్వం పెట్టిన అడ్డంకులపై, పెండింగ్‌లో ఉన్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోతే మంత్రి పరిశీలిస్తామన్నారన్నారు.

మళ్లీ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్

చాపాడు, జూలై 18: చియ్యపాడు సర్పంచ్ తప్పెట వెంకటశివప్రసాద్ గురువారం మళ్లీ బాధ్యతలు చేపట్టినట్లు ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి పేర్కొన్నారు. అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలిపారు. కార్యదర్శి సుధాకర్ శివప్రసాద్‌ను విధుల్లో చేర్చుకున్నారు.

ఎమ్మెల్యే చొరవతో తాగునీటి మోటారు : సర్పంచ్

బ్రహ్మంగారిమఠం, జూలై 18: ఎమ్మెల్యే చొరవతో లక్ష్మీనరసింహ కాలనీలో కొత్త మోటర్ బిగించారని సర్పంచు చిలమల లక్ష్మీదేవి తెలిపారు. మల్లేపల్లి పంచాయతీ, లింగాలదిన్నెపల్లె, లక్ష్మీనరసింహ కాలనీలో పాత మోటారు ఉండేది. అయితే రెండేళ్లగా మర్మత్తులకు గురవుతుండడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యను మల్లేపల్లి సర్పంచు చిలమల లక్ష్మీదేవి, టీడీపీ నేత చిలమల నారాయణ ద్వారా ప్రజలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కొత్త మోటారు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశారని తెలిపారు.

అల్లాడుపల్లెలో డయేరియా

చాపాడు, జూలై 18: అల్లాడుపల్లెలో కొందరు డయేరియాతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మూడు రోజులుగా వారు వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. డయేరియా సోకిన వారిలో పిల్లలు సుమ, మౌనిక, వృద్ధురాలు పుల్లమ్మమ ఉన్నారు. వీరు ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చాపాడు డాక్టర్ రాజేష్‌కుమార్ బాధితులను పరిశీలించారు. తాగునీరు కలుషితం కారణంగానే డయేరియా వచ్చినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తెలుపుతున్న నరసింహారెడ్డి

పోరుమామిళ్ళ, జూలై 18: దోమల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు. గురువారం పోరుమామిళ్లలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీ రెసిడెన్సియల్ స్కూల్ హెడ్‌మాస్టర్ చెన్నకృష్ణయ్య, వార్డన్‌లు బాలుడు, శ్రీనివాసులు, బార్గవి, హెల్త్ అసిస్టెంట్ సాధు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేవరకు పోరాడతాం



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నేతలు

బద్వేలు, జూలై 18: జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేసేవరకూ పోరాడుతూ ఉంటామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం పట్టణంలో డీవైఎఫ్ఐ జిల్లా వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా డీవైఎఫ్ఐ నేతలు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టుల భర్తీకోసం రాజీలేని పోరాటాలు సాగించామని భవిష్యత్తులో కూడా యువత పక్షాన నిలబడి పోరాడతామన్నారు. ప్రత్యేక హోదా, కడప ఉక్కుపరిశ్రమ, రైల్వేజోన్, ప్రత్యేక ప్యాకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. డీవైఎఫ్ఐ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకోవాలి



సంజాముల మోటులో కూరగాయల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

జమ్మలమడుగు, జూలై 18: పట్టణంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా కూరగాయల మార్కెట్ ఆవరణలో వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంబాబు తెలిపారు. గురువారం సాయంత్రం సంజాముల మోటు వద్ద కూరగాయల మార్కెట్ ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. రెండో మార్కెట్ ఏర్పాటు చేస్తే వ్యాపారులు రోడ్డుపైకి వచ్చి తోపుడు బండ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ వ్యాపారాలు చేయడం తగదన్నారు. అలా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై తోపుడు బండ్లలో వ్యాపారం చేసేవారి పేర్లు ప్రత్యేకంగా బాడుగలకు ఇళ్లు తీసుకుని వ్యాపారాలు చేసేవారిని గుర్తించారు.

దేవునిపేరుతో ప్రభుత్వ స్థలం కబ్జా

పోరుమామిళ్ల, జూలై 18: దేవునిపేరు ముసుగులో కొందరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఆర్ఐ సుధాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అక్కల్‌రెడ్డిపల్లె రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 1854 నెంబర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి హద్దులు ఏర్పరచుకుని కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆర్ఐని వివరణ కోరగా వీఆర్ఓను సంఘటన స్థలానికి పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



చదును చేసిన ప్రభుత్వ స్థలం